సాక్షి
ఏలూరు
సోమవారం । 13 । మే । 2024



ఓటు వినియోగిద్దాం ఇలా..

భారత ఎన్నికల సంఘం ఓటు హక్కు రక్షణకు పలు చర్యలు చేపట్టింది. ఒకరికి బదులు వేరే వ్యక్తి ఓటేయకుండా కట్టడి చేసింది. 8లో ▸



15 నుంచి మహాయాగం

భీమవరం డీఎస్ఆర్ కళాశాల మైదానంలో ఈనెల 15 నుంచి 25 వరకు అతిరాత్ర మహాయాగం నిర్వహించనున్నారు. 8లో ▸



యువకుడి మృతి

ఆగిరిపల్లి మండలం అమ్మవారితిప్పగూడెం గ్రామానికి చెందిన నాగూల్ అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. 8లో ▸

న్యూస్‌రీల్

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తి శేషసాయికి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి ఆదివారం సందర్శించారు. కుటుంబసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలకగా, దేవస్థానం ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు స్వామి వారి జ్ఞాపిక, ప్రసాదాలను అందజేశారు.

సెక్టార్ అధికారి నిబద్ధత



ఎన్నికల విధులకు హాజరైన వెంకటేశ్వరరావును అభినందిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): ఎన్నికల విధులు నిర్వహించాలనే సంకల్పంతో శస్త్రచికిత్స చేయించుకున్న ఓ ఉద్యోగి అంకితభావం చూపగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అభినందించారు. ఆదివారం స్థానిక కోటదిబ్బలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ కార్యక్రమం జరిగింది. సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఉద్యోగి వెంకటేశ్వరరావు తన కాలుకి బోన్ సర్జరీ చేయించుకున్నా సెక్టార్ అధికారిగా విధులు నిర్వహించేందుకు ముందుకు వచ్చారు. ఆయనతో కలెక్టర్ మాట్లాడుతూ ఇబ్బంది పడతారేమో ఆలోచించుకోండని కోరినా.. విధులు నిర్వహించేందుకు వెంకటేశ్వరరావు నిబద్ధత చూపారు. దీంతో ఆయన్ను కలెక్టర్ అభినందించారు.

శ్రీవారి సేవలో ఎంపీ అభ్యర్థి సునీల్



గజలక్ష్మి నుంచి ఆశీర్వచనం పొందుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ ఆదివారం సందర్శించారు. సోమవారం ఎన్నికల పోలింగ్ కావడంతో ఆయన సెంటిమెంట్‌గా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం గో, గజ శాలలకు వెళ్లి అక్కడ గోవులకు దాణాను అందించారు, గజలక్ష్మి నుంచి ఆశీర్వచనాన్ని పొందారు.

ఏలూరులో వార్ వన్ సైడే

జగన్ కోసం జనం సిద్ధం

- జిల్లాలో క్లీన్‌స్వీప్ దిశగా వైఎస్సార్‌సీపీ
- ఐదేళ్లలో కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమం, అభివృద్ధి
- ప్రజల చెంతకు పాలన చేరువ
- ఏళ్ల నాటి సమస్యలకు శాశ్వత పరిష్కారం
- ఏలూరు వైద్య కళాశాల కల సాకారం
- ఎన్నికల ప్రచారంలో చేతులెత్తేసిన కూటమి అభ్యర్థులు





ఏలూరు శనివారపుపేటలో నాడు-నేడులో అభివృద్ధి చేసిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఇన్‌సెట్‌లో) ఏలూరులో డిజిటల్ తరగతి గదిలో పాఠాలు వింటున్న విద్యార్థినులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ప్రజలే స్టార్ క్యాంపెయినర్లు.. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి ఇంటికీ పథకాలు అందాయి.. ఊళ్ల రూపురేఖలు మారాయి.. ప్రతి ఊరిలో నాడు-నేడులో బాగుపడిన పాఠశాలలు, గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, రహదారుల నిర్మాణాలు కనిపిస్తున్నాయి.. జిల్లాలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న తమ్మిలేరు రిటైనింగ్ వాల్‌తో సహా కీలక అభివృద్ధి పనులన్నీ పూర్తయ్యాయి. వంచనకు, విశ్వసనీయతకు మధ్య జరిగే ఎన్నికల సంగ్రామం తుది అంకానికి చేరింది. విశ్వాసాన్ని చూరగొని అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌కే మళ్లీ పట్టం కట్టనున్నారు ప్రజలు. జిల్లాలో మరోసారి క్లీన్‌స్వీప్ సాధించే దిశగా ఫ్యాన్ పార్టీ దూసుకువెళ్తుంది.

90 శాతం మందికి పైగా పథకాలు

సచివాలయం, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల చెంతకు పాలన చేరువైంది. అర్హతే ప్రామాణికంగా పక్కా పారదర్శకంగా పథకాలు అందాయి. అలాగే ప్రతి పల్లెలో ప్రజలే స్టార్ క్యాంపెయినర్లుగా మారడం వైఎస్సార్‌సీపీకి కలిసొచ్చే అంశం. 90 శాతం మందికి పైగా ప్రజలు పారదర్శకంగా పథకాలు అందుకోవడం ప్రభుత్వంపై విశ్వాసాన్ని పెంచింది. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ వైఎస్సార్ సర్కారు అండగా నిలిచి ప్రాణనష్టాన్ని నివారించడంతో పాటు ప్రజలకు పల్లెల్లోనే మెరుగైన వైద్యాన్ని అందించి అభిమానాన్ని చూరగొంది.

సైకిల్ మరమ్మతులతో సరి

దిగుమతి నేతలతో స్థానిక నేతలకు సమస్యలు, కూటమి పేరుతో చివరి నిమిషంలో ఊడిపడ్డ జనసేన, బీజేపీ నేతలతో చికాకులు, నాయకులతో సమన్వయలేమి ఇలా గందరగోళాలతో సైకిల్ పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గతంలో 14 ఏళ్ల అధికారంలో ఉన్నా జిల్లాను పట్టించుకోకపోవడం, సంక్షేమ పథకాలు ప్రజలకు అందకుండా టీడీపీ నేతలు జేబులు నింపుకోవడం, కొన్నిచోట్ల పెద్ద ఎత్తున విధ్వంసకాండ, కోట్ల దోపిడీ, అధికారులపై దాడులు వంటి ఘటనలను జిల్లా ప్రజలు మరిచిపోలేదు. టీడీపీ ఎంపీ అభ్యర్థి, దిగుమతి నేత పుట్టా మహేష్‌కు జిల్లా నేతల నుంచి సహకారం లేకపోవడం, పోలవరం, చింతలపూడి, కైకలూరు, నూజివీడు ఇలా అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ నేతల వివాదాలను పరిష్కరించలేని పరిస్థితితో పూర్తిస్థాయిలో ఎన్నికల ప్రచారం చేయలేక చేతులెత్తేశారు. ఇక జిల్లాలో చంద్రబాబు ఏలూరు, నూజివీడు, దెందులూరులో సభలు నిర్వహించినా అట్టర్ ఫ్లాప్ కావడంతో పార్టీ కేడరే లైట్ తీసుకుంది. అలాగే కీలక నియోజకవర్గాల అభ్యర్థులు పోలింగ్‌కు ముందే చేతులెత్తేసిన పరిస్థితి కనిపిస్తోంది.

జగన్ అంటే నిజం

ఐదేళ్ల జగన్ సంక్షేమ పాలనలో నవరత్నాల ద్వారా జిల్లాలో రూ.8,500 కోట్ల మేర నగదు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. అలాగే ఏలూరు వైద్య కళాశాల నిర్మాణం పూర్తి చేసి 150 ఎంబీబీఎస్ సీట్లతో తరగతులు ప్రారంభించడం, కొల్లేరు మిగులు భూముల పంపిణీకి వీలుగా సర్వే ప్రక్రియ తుది దశకు చేరడం, టీడీపీ విధ్వంసానికి గురైన పోలవరం ప్రాజెక్టును గాడిలో పెట్టి యుద్ధ ప్రాతిపదికన ప్రధాన పనులు పూర్తిచేయడంతో పాటు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో సమగ్ర అభివృద్ధి పనులు వంటివి జరిగాయి. ఏలూరులో 50 ఏళ్ల ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా తమ్మిలేరు రిటైనింగ్ వాల్‌ను రూ.80 కోట్లతో పూర్తి చేయించారు. అలాగే బుట్టాయగూడెం, చింతలపూడి, నూజివీడుల్లో ప్రభుత్వ ఆస్పత్రుల ఆధునీకీకరణ పనులు ఈ ప్రభుత్వ హయాంలోనే జరిగాయి.

క్లీన్‌స్వీప్ చేయనున్న వైఎస్సార్‌సీపీ

జిల్లాలో వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్ దిశగా దూసుకువెళ్తుంది. ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులు ఇప్పటికే రెండుసార్లు గడపగడపకూ వెళ్లడం, విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించడం, ప్రజలే స్టార్ క్యాంపెయినర్లుగా మారడం పార్టీకి కలిసి వచ్చిన అంశాలు. పార్టీ అధినేత, సీఎం జగన్ దెందులూరులో లక్షలాది మందితో సిద్ధం బహిరంగ సభ నిర్వహించడం, ఏలూరు, కైకలూరులో ఎన్నికల ప్రచార సభలు, దెందులూరు, ఏలూరు, ఉంగుటూరులో రోడ్‌షోకు అపూర్వ స్పందన వచ్చింది. ఇక పార్టీ అభ్యర్థులు ప్రణాళికాబద్ధంగా ఎన్నికల ప్రచారం చేశారు. అలాగే 60 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా ఏలూరు ఎంపీ స్థానాన్ని వైఎస్సార్‌సీపీ బీసీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌కు కేటాయించింది. అలాగే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఏలూరు నుంచి ఆళ్ల నాని, దెందులూరు నుంచి కొఠారు అబ్బయ్యచౌదరి, ఉంగుటూరు నుంచి పుప్పాల వాసుబాబు, నూజివీడు నుంచి మేకా వెంకట ప్రతాప అప్పారావు, కైకలూరు నుంచి దూలం నాగేశ్వరరావు, చింతలపూడి నుంచి కంభం విజయరాజు, పోలవరం నుంచి తెల్లం రాజ్యలక్ష్మి ఎన్నికల ప్రచారాన్ని విజయవంతంగా ముగించారు.

ఇంటికే సంక్షేమం

జిల్లాలోని 28 మండలాల్లో 548 సచివాలయాలు నిర్మించి 600 రకాల సేవలను స్థానికంగా అందిస్తున్నారు. పెన్షన్ మొదలుకొని పౌర సేవలు, రేషన్ వంటివి ఇంటికే అందిస్తున్నారు. 271 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించి పల్లెల్లో మెరుగైన వైద్యం అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా 2,83,239 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 350 రైతు భరోసా కేంద్రాలు నిర్మించి దళారీ వ్యవస్థ లేకుండా ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తున్న పరిస్థితి. నాడు-నేడుతో జిల్లాలో 2,032 పాఠశాలలను రూ.270.75 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశారు. జిల్లాలో 1,16,431 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చిన చరిత్ర సర్కారుది. రూ.713.17 కోట్లతో 98,874 మంది ఇళ్ల నిర్మాణం చేసుకునేలా ప్రభుత్వం పూర్తిగా సహకారం అందించింది. జిల్లాలో 2.81 లక్షల మందికి ఐదేళ్లల్లో రూ.3,880 కోట్ల పెన్షన్ , 35,745 ఆసరా గ్రూపుల్లోని రూ.3.55 లక్షల మంది మహిళలకు రూ.1305.05 కోట్ల రుణమాఫీ, 1.78 లక్షల మంది తల్లుల ఖాతాల్లో అమ్మఒడి పథకం కింద రూ.1,069.30 కోట్లు, 1.73 లక్షల మంది మహిళల ఖాతాల్లో ఏటా రూ.130.15 కోట్ల చొప్పున విద్యాకానుక ఇలా పలు సంక్షేమ పథకాల వేల కోట్ల లబ్ధిని చేకూర్చారు.

ప్రశాంతంగా పోలింగ్ జరగాలి



పెదవేగిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ మేరీ ప్రశాంతి

పెదవేగి: పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి గొడవలు జరగకుండా సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు వహించాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. ఆదివారం రాత్రి పెదవేగి హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతితో కలిసి ఆయన తనిఖీ చేశారు. సిబ్బందికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, భారీ బందోబస్తు, ప్రత్యేక బలగాలను ఏర్పాటుచేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య, పెదవేగి సీఐ కె.శ్రీనివాసకుమార్, ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ వారి వెంట ఉన్నారు.

ఓటేద్దాం..రండి

నేడే ఎన్నికల పోలింగ్

- జిల్లాలో 16.37 లక్షల మంది ఓటర్లు
- 1,744 పోలింగ్ కేంద్రాలు
- 415 సమస్యాత్మక కేంద్రాల్లో పటిష్ట భద్రత



ఏలూరు సీఆర్‌ఆర్ ఉమెన్స్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ఎన్నికల సిబ్బంది



ఈవీఎంను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్



సిబ్బందికి సూచనలిస్తున్న జేసీ లావణ్యవేణి

ఏలూరు(మెట్రో): సార్వత్రిక ఎన్నికల సమరం తుదిదశకు చేరుకుంది. సోమవారం ఉదయం జిల్లా వ్యాప్తంగా ఎన్నికల పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లాలో ఒక పార్లమెంట్ స్థానం, ఏడు అసెంబ్లీ స్థానాలకు ఎన్నికల జరుగనున్నాయి. జిల్లాలో మొత్తం ఓటర్లు 16,37,430 మంది ఉండగా 1,744 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు.

20 వేల మంది సిబ్బంది

జిల్లాలో ఎన్నికల విధుల్లో 16 వేల మంది సిబ్బంది, 4 వేల మంది పోలీస్ సిబ్బంది పాల్గొంటున్నారు. అన్ని నియోజకవర్గాలను 193 సెక్టార్లుగా విభజించి ఆయా పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం, వీవీ ప్యాట్‌లతో పాటు ఎన్నికల సామగ్రిని అందించారు. ఏలూరుతో పాటు ఆయా నియోజకవర్గాల ప్రధాన మండల కేంద్రాల్లో ఎన్నికల సామగ్రి పంపిణీ ఆదివారం ఉదయం నుంచి ప్రారంభమైంది. మధ్యాహ్నం నుంచి పోలింగ్ సిబ్బంది సామగ్రితో ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల ద్వారా ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పడవపై వెళ్లే వేలేరుపాడు మండలంలోని కాకిసనూరు పోలింగ్ కేంద్రానికి మధ్యాహ్నమే సిబ్బంది చేరుకున్నారు.

అదనపు ఈవీఎంలు

అధికారులు సోమవారం ఉదయం 5.30 గంటలకు మాక్‌పోల్, ఉదయం 7 గంటలకు సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. పోలవరం అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్లు దూరంగా ఉండటంతో అక్కడ సెక్టార్ ఆఫీసర్ల వద్ద రెండు అదనపు ఈవీఎంలను అందుబాటులో ఉంచారు. ఎక్కడైనా ఈవీఎం సాంకేతిక సమస్య తలెత్తితే 15 నుంచి 20 నిమిషాల్లో అందించేలా చర్యలు తీసుకున్నారు. సమస్యల పరిష్కారానికి ప్రతి నియోజకవర్గానికి ముగ్గురు చొప్పున బెల్ అధికారులు అందుబాటులో ఉంటారు. ఫోన్ సౌకర్యం లేని 13 పోలింగ్ కేంద్రాల్లో వీహెచ్‌ఎఫ్ సెట్లను ఏర్పాటుచేశారు.

415 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు

జిల్లాలో 415 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తంగా 1,069 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటుచేశారు. దివ్యాంగుల సౌకర్యార్థం 1,100 వీల్ చైర్‌లు అందుబాటులో ఉంచారు. పోలింగ్ సిబ్బంది తరలింపునకు 150 ఆర్టీసీ, 350 ప్రైవేటు వాహనాలు ఏర్పాటుచేశారు.

విస్తృత ఏర్పాట్లు

జిల్లాలో ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం చేసినట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఏలూరు కోటదిబ్బలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వద్ద షామియానాలు, తాగునీరు సౌకర్యంతోపాటు హెల్త్ క్యాంపు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటికే 15,615 మంది సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను, 896 మంది వృద్ధులు, దివ్యాంగులు హోమ్ ఓటింగ్‌ను వినియోగించుకున్నారన్నారు. జిల్లాలో 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 7 మహిళా పోలింగ్ కేంద్రాలు, పోలవరం, చింతలపూడి నియోజకవర్గాల్లో యువత కోసం రెండు ప్రత్యేక కేంద్రాలు, విభిన్న ప్రతిభావంతుల కోసం ఏలూరు, దెందులూరు నియోజకవర్గాల్లో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

మెటీరియల్‌ను సరిచూసుకుని..

దెందులూరు: ఏలూరు సీఆర్‌ఆర్ ఉమెన్స్ కళాశాలలో దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల మెటీరియల్ పంపిణీని ఆదివారం చేపట్టినట్టు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. మెటీరియల్ సరిచూసుకుని ఆయా కేంద్రాలకు వెళ్లాలని సిబ్బందికి సూచించారు.

సౌకర్యాల కల్పనపై ఆరా

ఏలూరు కోటదిబ్బలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను కలెక్టర్ పరిశీలించి సౌకర్యాల కల్పనపై సిబ్బందిని ఆరా తీశారు. సిబ్బందికి భోజనాలు వడ్డించి వారితో కలిసి భోజనం రుచి చూశారు.

అనుకున్న సమయం కంటే ముందుగానే..

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఎన్నికల సామగ్రి పంపిణీ విజయవంతంగా ముగిసింది. ఆయా కేంద్రాల వద్ద రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది ఎన్నికల సామగ్రితో వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు పయనమయ్యారు. అధికారుల సమష్టి కృషితో ఎన్నికల సిబ్బంది అనుకున్న సమయం కంటే ముందుగానే బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో పయనమయ్యారు. ఉంగుటూరు కేంద్రం వద్ద వసతులను ఎన్నికల పరిశీలకులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఓటు వేయడం సామాజిక బాధ్యత

సోమవారం జరిగే ఎన్నికల పోలింగ్‌లో ప్రతి పౌరుడూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ కోరారు. మన భవిష్యత్తును మనమే నిర్ణయించుకునే అవకాశం ఎన్నికల ద్వారా కలుగుతుందన్నారు.



ఎన్నికల సామగ్రితో ఉద్యోగిని



ఆమే కీలకం

- జిల్లాలో సింహభాగం మహిళా ఓటర్లే
- పురుషుల కంటే 38,822 మంది అధికం
- మొత్తం ఓటర్లు 16.37 లక్షలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: సార్వత్రిక ఎన్నికల్లో మహిళా ఓటర్లు నిర్ణేతలు కానున్నారు. నిర్ణయాత్మకశక్తిగా మారనున్నారు. జిల్లాలో తుది ఓటర్ల జాబితాలో మహిళా ఓటర్లే అధికంగా ఉండటంతో వారే ప్రధాన భూమిక పోషించనున్నారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 16,37,430 ఉండగా వీరిలో పురుషులు 7,99,241 మంది, మహిళలు 8,38,063 మంది ఉన్నారు. పురుష ఓటర్లతో పోల్చితే మహిళా ఓటర్లు 38,822 మంది అధికంగా ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్స్	మొత్తం
ఉంగుటూరు	1,01,545	1,04,886	6	2,06,437
దెందులూరు	1,08,915	1,15,089	9	2,24,013
ఏలూరు	1,12,426	1,22,872	47	2,35,345
పోలవరం	1,22,760	1,31,212	9	2,53,981
చింతలపూడి	1,34,295	1,38,733	41	2,73,069
నూజివీడు	1,18,104	1,20,867	10	2,38,981
కైకలూరు	1,01,196	1,04,404	4	2,05,604
మొత్తం	7,99,241	8,38,063	126	16,37,430



ఎన్నికల విధులకు మేము సైతం అంటున్న మహిళా సిబ్బంది



కాకిసనూరులో ఎన్నికల సిబ్బందికి స్వాగతం పలికిన గిరిజనులు

క్లుప్తంగా

108 వాహనంలో ప్రసవం



కొడమంచిలిలో శిశువుతో 108 సిబ్బంది

పెనుగొండ: ఆచంట మండలం కొడమంచిలికి చెందిన గర్భిణి 108 వాహనంలో ప్రసవించింది. కొడమంచిలికి చెందిన లక్ష్మీ పూజితకు పురిటి నొప్పులు వస్తుండడంతో స్థానిక వైద్యులు కాకినాడ జీజీహెచ్‌కు పంపాలని సూచించడంతో 108కి సమాచారం అందించారు. 108 వాహనంలో జీజీహెచ్‌కు తరలిస్తుండగానే మార్గమధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్ టెక్నీషియన్ జి.సురేష్, పైలెట్ నాగేశ్వరరావు డెలివరీ చేయించడంతో ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డా క్షేమంగా ఉండడంతో వీరిని మార్గమధ్యలో తూర్పు గోదావరి జిల్లా మండపేట మండలం ఆలమూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు.

ఎన్నికల విధుల్లో ఉద్యోగిని తలకు గాయం



గాయపడ్డ ఉద్యోగినిని వైద్యానికి తరలిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏ గ్రౌండ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఈవీఎంల పంపిణీ కార్యక్రమానికి హాజరైన మహిళా ఉద్యోగినికి ప్రమాదవశాత్తూ తలకు గాయమైంది. పోలింగ్ విధులకు హాజరైన సిబ్బంది కోసం భారీగా టెంట్‌లను ఏర్పాటు చేశారు. సుమారు 2000 మందికి పైగా ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అయితే ఈవీఎంలు తీసుకుని టెంట్‌లో కుర్చుని ఉన్న సమయంలో టెంట్‌కు వేసిన ఒక కర్ర మహిళా ఉద్యోగిని తలపై పడడంతో తీవ్ర గాయమైంది. దీంతో అక్కడి సిబ్బంది ఆమెను వైద్యం కోసం తరలించారు.

తెలంగాణ మద్యం పట్టివేత



నిందితుడు, పట్టుబడిన మద్యంతో పోలీసులు

కై కలూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీల్లో 130 తెలంగాణ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ సుధ చెప్పారు. కలిదిండి మండలం పడమటి పాలెంలో ఆదివారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఓ వ్యక్తి నుంచి రూ.22,100 విలువైన మద్యం సీసాలను తరలిస్తుండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారమన్నారు. ఎస్ఈబీ ఎస్సై రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కు.. వినియోగిద్దాం ఇలా..



- ఓటు హక్కు రక్షణకు ఎన్నికల సంఘం చర్యలు
- ఒకరి ఓటు వేరొకరు వేయకుండా కట్టడి
- స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించేలా ప్రత్యేక దృష్టి

ఏలూరు టౌన్ : భారత ఎన్నికల సంఘం ఓటు హక్కు రక్షణకు అనేక చర్యలు చేపట్టింది. ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవడంతో పాటు, తన ఓటును వేరేవారు వేయడాన్ని కట్టడి చేసేందుకు టెండర్ ఓటు, చాలెంజ్ ఓటు నమోదు చేసే అవకాశాన్ని కల్పించారు. ఓటర్లు తమ ఓటు హక్కు స్వేచ్ఛగా ఎటువంటి ఇబ్బంది లేకుండా వేసేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి సారించింది. ఓటు హక్కు రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ఎన్నికల సంఘం ఆదేశాలు ఇలా ఉన్నాయి.

టెస్ట్ ఓటు

ఓటరు తన ఓటు వేశాక వీవీ ప్యాట్‌లోని స్లిప్‌లో తాను కోరుకున్న అభ్యర్థికి ఓటు పడలేదని గుర్తిస్తే వెంటనే ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయాలి. తప్పుడు అభియోగమైతే జరిగే పరిణామాలను ప్రిసైడింగ్ అధికారి ఓటరుకు హెచ్చరిస్తారు. ఓటరు నుంచి రాతపూర్వకంగా అమోదం తీసుకుంటారు. పోలింగ్ ఏజెంట్ల ముందు ఓటింగ్ మిషన్‌లో టెస్ట్ ఓటు వేసేందుకు అనుమతిస్తారు. టెస్ట్ ఓటు వేసే సమయంలో ఓటరు కోరుకున్న అభ్యర్థి పేరు, చిరునామా ఫారం–14లో నమోదు చేస్తారు. ఓటరు ఆరోపణ తప్పుగా తేలితే రెండో ఎంట్రీకి ఎదురుగా ఓటరు ఏ అభ్యర్థికి ఓటు వేసిందీ రాసి, అతని సంతకం తీసుకుని పోలీసులకు అప్పగిస్తారు.

నమూనా ఓటు

పోలింగ్ బూత్‌లో ఎన్నికల ప్రక్రియ ప్రారంభానికి గంట ముందు ఈవీఎం చెక్ చేసేందుకు వివిధ రాజకీయ పార్టీల పోలింగ్ ఏజెంట్లతో 50 ఓట్లు వేస్తారు. ఆ ఓట్ల లెక్కింపు వెంటనే పూర్తి చేసి ఈవీఎంల నుంచి తొలగిస్తారు. అనంతరం పోలింగ్ ప్రక్రియను ప్రారంభిస్తారు. ఈవీఎంలను పరిశీలించేందుకు వేసే ఓట్లను నమూనా ఓట్లు అంటారు.

టెండర్ ఓటు

ఓటరు తమ ఓటు వేసేందుకు పోలింగ్ బూత్‌కు వెళ్లినప్పుడు అంతకుముందే ఎవరైనా ఓటు వేసి ఉంటే టెండర్ ఓటు వేయవచ్చు. ఆరోపణ చేసిన ఓటరు వాస్తవ ఓటరుగా నిర్ధారించుకున్నాక పోలింగ్ అధికారి అతడికి బ్యాలెట్ ఓటు వేసే అవకాశం ఇస్తారు. వారికి ఈవీఎంలో బటన్ నొక్కే అవకాశం ఉండదు. బ్యాలెట్ సీల్డ్ కవర్‌లో భద్రపరుస్తారు. అభ్యర్థుల ఓట్ల లెక్కింపు అనంతరం సమానంగా ఓట్లు వస్తే టెండరు ఓటును పరిగణనలోకి తీసుకుంటారు.

చాలెంజ్ ఓటు

ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లిన ఓటరుపై పోలింగ్ ఏజెంట్ల నుంచి ఓటరు కాదని అభ్యంతరం చెబితే చాలెంజ్ ఓటు వేయవచ్చు. అభ్యంతరం చెప్పిన ఏజెంట్ నుంచి పోలింగ్ అధికారి రూ.2లు తీసుకుని రశీదు ఇస్తారు. ఓటరు, ఏజెంట్లు అక్కడ ఉన్న ఇతర ఓటర్ల నుంచి పోలింగ్ అధికారి వివరాలు తీసుకుంటారు. ఓటరుగా నిర్ధారణ చేశాక ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. ఒకవేళ నిర్ధారణ కాకుంటే చాలెంజ్ ఓటు వేసిన వ్యక్తిని పోలీసులకు అప్పగిస్తారు.

ఓటర్లూ.. ఈ నిబంధనలు పాటించండి

డీ. మేరి ప్రశాంతి జిల్లా ఎస్పీ



ఏలూరు టౌన్ : ఏలూరు జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ట చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ డీ మేరిప్రశాంతి చెప్పారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా వినియోగించుకునేందుకు గట్టి భద్రతా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజలు భయాందోళలనకు గురికాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఇక ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్లు, రాజకీయపార్టీలు, అధికారులు ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

- జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంది. 144 సీఆర్‌పీసీ సెక్షన్ అమలులో ఉన్నందున నలుగురికి మించి ఒకచోట గుమిగూడి ఉండకూడదు.
- పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లు సెల్‌ఫోన్లు తీసుకురాకూడదు
- మహిళలు, పురుషులు వేర్వేరుగా క్యూలైన్ పాటించి పోలీసు శాఖతో సహకరించాలి
- మద్యం తాగి ఓటు వేయటానికి రాకూడదు
- పోలింగ్ కేంద్రానికి ఎలాంటి మారణాయుధాలు తీసుకురాకూడదు. వాటర్ బాటిల్స్, ఇంకు బాటిల్స్ కేంద్రలోకి నిషిద్ధం
- రాజకీయ పార్టీలకు చెందిన స్టిక్కర్లు, టోపీలు, కండువాలు, జెండాలతో పోలింగ్ కేంద్రానికి రాకూడదు
- ఓటరు స్లిప్‌తో ఓటు వేసేందుకు వెళితే ఓటరు ఏదైనా ఒక గుర్తింపు కార్డును విధిగా తీసుకు వెళ్లాలి
- పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, సర్వీస్ గుర్తింపు కార్డు, ఫొటోతో కూడిన బ్యాంకు, పోస్ట్ ఆఫీస్ పాస్‌బుక్, పాన్ కార్డు, ఆధార్‌కార్డు, హెల్త్‌కార్డు, పెన్షన్ డాక్యుమెంట్ ఇలా ఏదోక గుర్తింపు తీసుకెళ్లాలి
- పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల లైన్ లోపల మాత్రమే ఓటర్లకు ప్రవేశం ఉంటుంది
- ఓటు వేసిన వెంటనే పోలింగ్ కేంద్రాన్ని విడిచి వెళ్లాలి. పోలింగ్ కేంద్రంలో ఉండేందుకు అనుమతి లేదు.
- పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల అవతల మాత్రమే ఓటు వేసేందుకు వచ్చేవారి వాహనాలను పార్కింగ్ చేయాలి
- పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలో రాజకీయ పార్టీలకు చెందిన వారు టెంట్లు వంటివి ఏర్పాటు చేసుకోవచ్చు. చిన్న టేబుల్, రెండు కుర్చీలు ఏర్పాటు చేసుకుని, ఇద్దరు వ్యక్తులు మాత్రమే అక్కడ ఉండాలి. పార్టీలకు చెందిన జెండాలు, బ్యానర్లు ప్రదర్శించకూడదు
- రాజకీయ పార్టీలకు చెందిన వారు పోలింగ్ కేంద్రాల సమీపంలో టెంట్లు ఏర్పాటు చేసి టిఫిన్లు, భోజనాలు వంటివి ఏర్పాటు చేయకూడదు
- పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్‌క్యాస్టింగ్ ఉన్నందున ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా నేరంగా పరిగణిస్తారు
- ఓటర్లు ఓటు వేసే సమయంలో ఫొటోలు తీయటం, సోషల్ మీడియాలో పోస్టు చేయటం చట్టరీత్యా నేరం.

15 నుంచి భీమవరంలో అతిరాత్ర మహాయాగం

- 11 రోజులపాటు 26 మంది రుత్వికులతో నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తయ్యాయంటూ యజ్ఞ పర్యవేక్షకుల వెల్లడి



అతిరాత్ర మహాయాగం కోసం వేసిన చలువ పందిరి

భీమవరం (ప్రకాశం చౌక్) : భీమవరం డీఎన్ఆర్ కళాశాలలోని గన్నాబత్తుల వారి మైదానంలో ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు 11 రోజులపాటు జరగనున్న అతిరాత్ర మహాయాగం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయని యజ్ఞ పర్యవేక్షకులు చెరుకువాడ రంగసాయి, నడింపల్లి బంగార్రాజు, కంతేటి వెంకటరాజు ఆదివారం చెప్పారు. రాష్ట్రం, ఇతర రాష్ట్రాల నుంచి వేద పండితులు, రుత్వికులు 11 రోజులపాటు యాగ నిర్వహణలో పాల్గొంటారన్నారు. యజ్ఞ కర్త జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో గజల్ మాస్టో గజల్ శ్రీనివాస్ నేతృత్వంలో డీఎన్నార్ కళాశాల యాజమాన్యం సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని, ప్రతి రోజూ శివ కల్యాణం, కోటి గాయత్రీ జపం, తదితర కార్యక్రమాలు జరపడానికి ఏర్పాట్లు పూర్తి అయ్యాయన్నారు. 11 రోజుల పాటు అన్నప్రసాదం, తీర్థ ప్రసాదాలు భక్తులకు అందజేస్తామని, భక్తులందరూ యజ్ఞ పూజ కార్యక్రమంలో పాల్గొని సహకారం అందించాలని కోరారు. శ్రీనివాస సుబ్రహ్మణ్యశర్మ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా కూడా ఇటువంటి మహాయాగం జరగలేదని, 25న పుత్రకామేష్టి యాగం జరుగుతుందని, 15న ఉదయం 7.45 గంటలకు ఈ యాగం ప్రారంభమవుతుందని తెలిపారు. అనంతరం ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో పట్టణ లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, విశ్వనాథ్‌రాజు, పెన్మెత్స సత్యనారాయణ రాజు, డి.అప్పలరాజు, రామ సీతా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్య జయంతి



క్షేత్రపాలకుని ఆలయంలో పూజలందుకుంటున్న ఆదిశంకరాచార్యులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ఆదిశంకరాచార్యుని జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. క్షేత్రపాలకుని ఆలయంలో ముందుగా అర్చకులు, పండితులు ఆదిశంకరాచార్యుని ఉత్సవ మూర్తికి విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం గర్భాలయంలో శివదేవుని వద్ద ఉంచి పూజలు నిర్వహించారు. తరువాత ప్రత్యేకంగా అలంకరించిన పల్లకి వాహనంలో ఆదిశంకరాచార్యుని చిత్రపటాన్ని, ఉత్సవమూర్తిని ఉంచి క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా ఊరేగించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆదిశంకరాచార్యుని విశిష్టతను భక్తులకు తెలియజేశారు. ఆలయానికి చేరుకున్న తరువాత శంకరాచార్యుని ఉత్సవమూర్తికి, అలాగే గంగా, పార్వతీ సమేత శివదేవుని ఉత్సవమూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

ఎన్నికల వేళ.. చేపల చెరువు తవ్వకం

- ఎంఎంపురంలో టీడీపీ నేత నిర్వాకం
- అడ్డుకున్న ఆటవీ, పోలీస్, రెవెన్యూ అధికారులు
- రెండు జేసీబీల సీజ్, కౌలు రైతుపై కేసు నమోదు



భీమడోలు: ఎన్నికల వేళ టీడీపీ నేత పుప్పాల శ్రీనివాసరావు పూళ్ల పంచాయతీ శివారు ఎంఎం పురంలోని కొల్లేరు కాంటూరు పరిధిలో 30 ఎకరాల వ్యవసాయ భూమిలో చేపల చెరువును తవ్వించేందుకు ఆదివారం గుట్టుగా పనులకు ఉపక్రమించారు. సమాచారం అందుకున్న ఆటవీ, పోలీస్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడి చేసి చెరువు తవ్వకం పనులను అడ్డుకుని రెండు జేసీబీలను స్వాధీనం చేసుకున్నారు. కౌలు రైతుపై కేసు నమోదు చేశారు. ఆ భూమి కాంటూరు పరిధిలో ఉన్నందున కేవలం సాగుకు మాత్రమే అనుమతి ఉంది. ఆ భూమిని కొన్నేళ్లుగా మన్యం బాబూజీ అనే కౌలు రైతు సాగు చేస్తున్నాడు. ఎన్నికల వేళ ఆ వ్యవసాయ భూమిని టీడీపీ నేత ప్రోద్బలంతో కౌలు రైతు మన్యం బాబూజీ రెండు జేసీబీలతో వ్యవసాయ భూమి చుట్టూ నిబంధనలను ఉల్లంఘిస్తూ గట్టు వేసేందుకు పనులను ప్రారంభించారు. దీంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. హుటాహుటిన వచ్చిన అటవీ శాఖ ఎఫ్ఎస్‌వో ఎం.పాపారత్నం, ఏఎస్సై చలపతిరావు, రెవెన్యూ అధికారులు ఆ భూమిని పరిశీలించి గట్టు వేస్తున్న రెండు జేసీబీలను స్వాధీనం చేసుకున్నారు. 150 మీటర్లలో 8.30 ఎకరాల భూమి చుట్టూ గట్టు వేశారని అటవీ శాఖ ఎఫ్ఎస్‌వో పాపారత్నం నిర్ధారించారు. కౌలు రైతు మన్యం బాబూజీపై కేసు నమోదు చేశారు. కొల్లేరు కాంటూరు భూమిలో చేపల చెరువులు తవ్వితే వారిపై అటవీ శాఖ చట్టం మేరకు కేసులు నమోదు చేస్తామని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



నాగుల్ మృతదేహం

ఆగిరిపల్లి: మండలంలోని అమ్మవారిగూడెంతిప్పకు చెందిన యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఏఎస్సై తవేరియా నాయక్ తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ నాగుల్ (18) అనే యువకుడు తాపీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చిన నాగుల్ సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు చుట్టుపక్క ప్రాంతాల్లో వెతికిన ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం ఆగిరిపల్లి శివారు గన్నవరం రోడ్డులోని పూల్చేరు కుంటలో నాగుల్ మృతదేహాన్ని కొంతమంది యువకులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లి రేహమునిస్సా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

టీడీపీ నేతల దాడిలో వైఎస్సార్ సీపీ నేతకు గాయాలు



నుదుటిపై గాయంతో చినవెంకన్న

ద్వారకాతిరుమల: పంగిడిగూడెంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం రాత్రి చేసిన దాడిలో వైఎస్సార్ సీపీ నాయకుడికి గాయాలయ్యాయి. బాధితుడి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పంగిడిగూడెం మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు లావూరి చినవెంకన్నపై అదే గ్రామానికి చెందిన టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దారవత్తు నాగరాజు, ఆ పార్టీ నాయకుడు వడ్లపూడి శ్రీను, కార్యకర్తలు బోడ ప్రసాద్, లావూరి నాగరాజు, భుక్య వెంకట్రావు కక్ష పెంచుకున్నారు. రాజకీయంగా అడ్డు వస్తున్నాడన్న కారణంగా ఇప్పటికే పలుమార్లు చినవెంకన్నతో వారు గొడవలు పడ్డారు. ఇదిలా ఉంటే శనివారం రాత్రి చినవెంకన్న ఇంటి వద్దకు వెళ్లిన సదరు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అతడిని బయటకు పిలిచి ఒక్కసారిగా దాడి చేశారు. రాయితో కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఎన్నికల పోలింగ్ జరిగే సమయంలో అక్కడికి వస్తే చంపేస్తామని హెచ్చరించి, అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు తొలుత ద్వారకాతిరుమల పీహెచ్‌సీకి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జరిగిన ఘటనపై బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అంతర్జాతీయ చెస్ టోర్నీకి 50 మంది ఎంపిక



భీమవరంలో చెస్ టోర్నీ విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరంలో నిర్వహించిన స్టేట్ ఓపెన్ రాపిడ్ చెస్ టోర్నమెంట్ పోటీల్లో విజేతలకు ఆదివారం ప్రశంసాపత్రాలు అందజేశారు. స్థానిక శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక కేంద్రంలో నిర్వహించిన ఈ పోటీల్లో 200 మంది క్రీడాకారులు పాల్గొనగా 50 మంది విజేతలుగా నిలిచారు. వీరిలో పెద్దలు, చిన్నారులు 25 మంది ఉన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ విజేతలు జూన్ 4వ తేదీ నుంచి 6 రోజుల పాటు భీమవరంలో నిర్వహించే ఇంటర్నేషనల్ రాపిడ్ టోర్నమెంట్‌లో పాల్గొనడానికి అర్హత సాధించారన్నారు. రాపిడ్ టోర్నమెంట్‌లో విజేతలకు సుమారు రూ.5 లక్షల నగదు బహుమతులు అందిస్తామన్నారు. శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపం కార్యదర్శి మెంటే పార్థసారథి మాట్లాడుతూ చెస్ ద్వారా అపారమైన మేధాశక్తిని పెంపొందించుకోవచ్చని, తల్లిదండ్రులు చెస్ క్రీడను ప్రోత్సహించాలన్నారు. ఎస్‌బీఐ మేనేజర్ మూర్తి, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ గనిరెడ్డి త్రినాథ్, ఏలూరు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి శిరిగినీడి కోటేశ్వరరావు, పెదపాటి రవిప్రసాద్, అల్లు శ్రీనివాస్, మాదాసు రవికుమార్, చెస్ చీఫ్ ఆర్బిటర్ జీవీ కుమార్ పాల్గొన్నారు.

నేత్రపర్వం.. చాత్మార్ ఉత్సవం



తొళక్క వాహనంపై క్షేత్ర పురవీధులకు పయనమైన స్వామి, అమ్మవార్లు

ద్వారకాతిరుమల: శ్రీవారి చాత్మార్ ఉత్సవం ఆదివారం రాత్రి క్షేత్ర పురవీధుల్లో నేత్రపర్వంగా జరిగింది. శ్రీమద్రామానుజుల తిరు నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ వేడుకను అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అర్చకులు తొళక్క వాహనంపై ఉంచి, సుగంధ భరిత పుష్పమాలికలతో విశేషంగా అలంకరించారు. అనంతరం పూజాధికాలను జరిపి, హారతులిచ్చారు. ఆ తరువాత స్వామివారి వాహనం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. ప్రతి ఇంటి వద్ద భక్తులు శ్రీవారికి నీరాజనాలను సమర్పించారు.

ఓట్ల పండగకు సొంతూళ్లకు..

- జిల్లాకు తరలివస్తున్న ప్రవాస జిల్లా వాసులు
- హైదరాబాద్ నుంచి 42 ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు
- రోజువారీ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులూ 20 పైనే

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో ఓట్ల పండగకు ప్రజలు సొంతూళ్ల బాట పట్టారు. ఉద్యోగాలు, వ్యాపారాల రీత్యా ఇతర జిల్లాల్లో స్థిరపడినా ఓటు హక్కును ఈ జిల్లాలోనే వినియోగించుకునేందుకు సిద్ధమవుతున్నారు. వీరి కోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసింది. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో స్థిరపడిన జిల్లా వాసులను జిల్లాకు తరలించడానికి ఆర్టీసీ 42 ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసింది. వీటిలో ఇంద్ర, అమరావతి వంటి ఏసీ బస్సులతో పాటు సూపర్ డీలక్స్ బస్సులు కూడా ఉన్నాయి. జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోలకు చెందిన బస్సులు గత శుక్రవారం రాత్రి నుంచి హైదరాబాద్ నుంచి జిల్లాకు ప్రజలను తరలించే పనిలో పడ్డాయి. 42 ప్రత్యేక బస్సులే కాకుండా హైదరాబాద్ నుంచి ప్రతి రోజూ జిల్లాకు వచ్చే సుమారు 20 బస్సులు కూడా ప్రజలను తీసుకువస్తున్నాయి. కాగా ఓటు వేయడానికి వస్తున్న ప్రవాస పశ్చిమ వాసులకు రానుపోను చార్జీలకయ్యే మొత్తాన్ని ఆయా నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులే ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఒక సామాజికవర్గానికి చెందిన నాయకులు హైదరాబాద్ నుంచి ఓటర్లను తరలించడానికి సుమారు 20 ప్రైవేట్ ఏసీ బస్సులను ఏర్పాటు చేసినట్లుగా ప్రచారం జరుగుతోంది.

కొత్త యువ ఓటర్లు 42,196

కాగా జిల్లాలో 18 – 19 సంవత్సరాలు నిండి కొత్తగా ఓటు హక్కు పొందిన యువ ఓటర్లు 42,196 మంది ఉన్నారు. వీరిలో 22,661 మంది యువకులు ఉండగా, 19,535 మంది యువతులు ఉన్నారు. వీరిలో ఉంగుటూరు నియోజకవర్గంలో 3195 మంది యువకులు, 2,828 మంది యువతులు, దెందులూరు నియోజకవర్గంలో 3,266 మంది యువకులు, 2,887 మంది యువతులు, ఏలూరు నియోజకవర్గంలో 3,026 మంది యువకులు, 2,655 మంది యువతులు ఉన్నారు. అలాగే పోలవరం నియోజకవర్గంలో 3,350 మంది యువకులు, 2,926 మంది యువతులు, చింతలపూడి నియోజకవర్గంలో 3,708 మంది యువకులు, 3,089 మంది యువతులు, నూజివీడు నియోజకవర్గంలో 3298 మంది యువకులు, 2,713 మంది యువతులు, కైకలూరు నియోజకర్గంలో 2818 మంది యువకులు, 2,437 మంది యువతులు ఉన్నారు. ఇదిలా ఉండగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కలిపి 20 నుంచి 29 సంవత్సరాల వయసు ఉన్న ఓటర్లు 2,89,116 మంది ఉన్నారు. వీరిలో 1,47,987 మంది యువకులు, 1,41,091 మంది యువతులు ఉన్నారు. వీరిలో కూడా తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునే వారు 20 శాతం మంది ఉంటారని అంచనా. మరో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే జిల్లాలో 100 నుంచి 109 సంవత్సరాల మధ్య వయసు కలిగిన సూపర్ సీనియర్ ఓటర్లు 21 మంది ఉండగా, 90 నుంచి 99 సంవత్సరాల మధ్య వయస్కులు 1,276 మంది ఓటర్లు ఉన్నారు.

జిల్లాలో పండుగ వాతావరణం నెలకొంది.. ఉద్యోగం, ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు స్వగ్రామాలకు తరలివస్తుండడంతో రహదారులన్నీ రద్దీగా మారాయి. దూరాభారమైనా, ప్రయాణపు ఇబ్బందులున్నా లెక్కచేయకుండా మంచి చేసిన ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు మేము సైతం అంటూ కదిలివస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం అని.. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని.. అందరూ ఇందుకోసం సమయం కేటాయించాలని.. అశ్రద్ధ చేయవద్దని పిలుపునిస్తున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్

ఓట్ల పండుగకు మేము సైతం..



- ఇతర ప్రాంతాల నుంచి సొంతూళ్లకు తరలివస్తున్న ప్రజలు
- జిల్లాలో కనిపిస్తున్న పండుగ వాతావరణం
- తొలి ఓటు కోసం కొత్త ఓటర్లలో నూతనోత్సాహం

ఓటు వేసేందుకు బాధ్యతగా వచ్చా



ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు. బుల్లెట్ కంటే బ్యాలెట్ గొప్పది అని నిరూపించిన దేశం మనది. ఓటు వేయడం నా బాధ్యతగా భావించి హైదరాబాద్ నుంచి ఓటు వేసేందుకు స్వగ్రామమైన జంగారెడ్డిగూడెం వచ్చాను. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి.

– ఎ.తేజస్విని, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి (జంగారెడ్డిగూడెం రూరల్)

ప్రజాస్వామ్యానికి ఓటు పునాది



విద్యావంతులు పోలింగ్‌కి దూరంగా ఉండటం ప్రజాస్వామ్యానికే ప్రమాదం. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా మార్పు రావాలి. హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న నేను ఓటు వేసేందుకు స్వగ్రామమైన వేగవరం వచ్చాను. ఓటు అనేది హక్కు మాత్రమే కాదు.. బాధ్యత కూడా. ప్రజాస్వామ్యానికి ఓటు అనేది పునాది లాంటింది.

– చిట్యాల రమేష్ (జంగారెడ్డిగూడెం రూరల్)

ఓటు విలువ తెలుసు



హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాను. టికెట్ రూ.2 వేలు అయినప్పటికీ ఓటు వేసేందుకు ఆదివారం సాయంత్రం మా ఊరు ఆగిరిపల్లి వచ్చాను. ఓటు విలువ తెలుసు కాబట్టే.. ఓటు హక్కును వినియోగించుకుంటా. – చిటికెల శోభన గిరి, ఆగిరిపల్లి (నూజివీడు)

ఓటు ఎంతో విలువైనది



భారత రాజ్యాంగం కల్పించిన ఓటు ఎంతో విలువైనది. నేను హైదరాబాద్‌లో ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాను. దూరభారమైనా.. ఓటు వేసేందుకు ట్రైన్‌లో హైదరాబాద్ నుంచి వచ్చా. ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఎన్నికల్లో ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించుకోవాలి.

– మెట్టపల్లి ప్రభుకుమార్, ఆగిరిపల్లి (నూజివీడు)

ఓటు వజ్రాయుధం



నేను హైదరాబాదులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాను. కుటుంబంతో సహా ఓటు వేయడానికి సొంతూరు మండవల్లి వచ్చాను. సమాజంలో ఓటు వజ్రాయుధం వంటిది. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలి. ప్రజా సంక్షేమంలో ఎవరూ నిజాయితీగా సేవలు అందిస్తున్నారో వారికి పట్టం కట్టాలి. ఓటు హక్కు వినియోగించుకుంటున్నందుకు గర్వపడుతున్నా.


– కె.లోకసాయి, హైదరాబాదు (కైకలూరు)

యువత ప్రభావం ఉంటుంది



ఈ ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికల్లో యువత ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. కొత్తగా ఓటు హక్కు వచ్చిన వారిలో విద్యాధికులే ఎక్కువ మంది ఉండడంతో వారు విజ్ఞతతో ఓటు వేసి తమ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసే నాయకుడిని ఎన్నుకోవడంలో కీలకంగా మారనున్నారు. గత పాలనలో దిశ చట్టం తీసుకురావడం చారిత్రాత్మకం.

– సీహెచ్.రసజ్ఞ, ఏలూరు (ఏలూరు ఆర్‌ఆర్ పేట)



మంచిచేసే నాయకుడిని ఎన్నుకునేందుకే..



ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఎన్నికల్లో ప్రతి ఓటు అత్యంత విలువైనదిగా నమ్ముతాను. నేను కన్యాకుమారిలో కొటక్ మహీంద్ర బ్యాంక్ ఉద్యోగిని. అడవికొలను రావడానికి వ్యయ ప్రయాసలతోపాటు, రెండు రోజులు ప్రయాణం అని తెలిసినా వజ్రాయుధం లాంటి ఓటు వేసేందుకు మా దంపతులు ఇద్దరం పిల్లలతో సహా వచ్చాం. ప్రజలకు మంచి చేసే నాయకుడినే ఎన్నుకుంనేందుకు ఈ శ్రమ.

– రాచపోతుల రామచంద్రరావు, సమత దంపతులు, అడవికొలను (నిడమర్రు)

చెన్నై నుంచి వచ్చాం



చెన్నైలో ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాను. ఉద్యోగం నిమిత్తం ఏ ప్రాంతంలో ఉన్నా పంచాయితీ నుంచి పార్లమెంట్ వరకూ జరిగే ప్రతి ఎన్నికల్లో ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకునేందుకు మా గ్రామం సీతారాంపురం వస్తాను. ఎన్నికలకు ముందు శని ఆదివారం రావడంతో పిల్లలతో సహా సొంత ఊరు వచ్చాము. విశ్వసనీయత గలిగిన నేతకే మా దంపతుల ఓటు.

– నడిమింటి సురేష్, కళ్యాణి, సీతారాంపురం (నిడమర్రు)

ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాం..



రాజ్యాంగం కల్పించిన హక్కు ఓటు. నాకు కొత్తగా ఓటు హక్కు వచ్చింది. ఈ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా. ఇటీవలి కాలంలో విద్యావంతులు ఎక్కువగా సమాజానికి అందుబాటులోకి వస్తున్నారు. వారందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశలు కల్పించే పాలకులు కావాలి.

– కే.వేణుశ్రీ. ఏలూరు (ఏలూరు ఆర్‌ఆర్ పేట)

మహిళలకు రక్షణ కల్పించే నాయకులకే మా ఓటు



సమాజం ఎంత వేగంగా అభివృద్ధి చెందినా మహిళల రక్షణ ప్రశ్నార్థకంగానే ఉంటోంది. చదవుల కోసమో, ఉద్యోగాల కోసమో బయటకు వెళ్లే మహిళలపై హత్యలు, అత్యాచారాలు జరుగుతూ ఆందోళన కలిగిస్తున్నాయి. మహిళల రక్షణ కోసం పనిచేసే నాయకులకే మా ఓటు వేస్తాం.

– ఎస్‌పీఎస్ వల్లి, ఏలూరు (ఏలూరు ఆర్‌ఆర్ పేట)

సంక్షేమం, అభివృద్ధికే మా ఓటు



పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి పాటుపడే నాయకుడు కావాలి. రాజకీయాల్లో యువతకూ స్థానం కల్పించి కొత్తవారిని ప్రోత్సహించాలి. అలాగే పార్లమెంట్‌లో రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడగలిగే నాయకుడు ఉంటే జాతీయ స్థాయిలో నిధులు వచ్చి రాష్ట్ర అభివృద్ధి మరింత వేగవంతమౌతుంది. అటువంటి వారికే ఓటు వేస్తాం.

– జీ సిద్ధుసాయి గణేష్ (ఏలూరు ఆర్‌ఆర్ పేట)

ప్రయాణంలో ఇబ్బంది పడ్డాం..



పెదపాడు నుంచి హైదరాబాద్‌కు జీవనోపాధి నిమిత్తం చాలా కాలం క్రితం వెళ్లాం. ఎన్నికల్లో ఓటు వేసేందుకు మా ఊరు వచ్చాం. ట్రైన్లు, బస్సులు కిక్కిరిసిపోవడంతో ప్రయాణంలో చాలా ఇబ్బంది పడ్డాం. అయినా ఓటు హక్కును వినియోగించుకోవాలనే బాధ్యతతో ఇక్కడకు వచ్చాం.

– కర్రి శ్రీనివాసరావు, పెదపాడు

ఇది మంచి అవకాశం



నేను హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాను. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవడం కోసం మా ఊరు వచ్చా. ప్రజలకు మంచి చేసి నాయకుడుని, నచ్చిన నేతను ఎన్నుకునేందుకు ఇది మంచి సదావకాశంగా భావిస్తున్నా.

– గంట తేజ, సత్యవోలు, పెదపాడు

ఓటు ఐదేళ్ల భవిష్యత్తు



హైదరాబాద్ చందానగర్ నుంచి ఓటే వేసేందుకు మా ఊరు వచ్చా. ఓటు హక్కును వినియోగించుకునేందుకు పుట్టినిల్లు మా గుండుగొలనుకు వ్యయ ప్రయాసాలతో వచ్చాను. ప్రజాస్వామ్యంలో ఓటు పవిత్రమైంది. ప్రజల తలరాతను మార్చే శక్తి ఓటు వల్లే సాధ్యం. ఐదేళ్ల ప్రజలు సుస్థిరాభివృద్ధి సాధించేందుకు, మంచి పాలకులను ఎన్నుకునేందుకు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి.

– దేగల ప్రియాంక, గుండుగొలను (భీమడోలు)



అన్నదాతలకు అండగా..

- వ్యవసాయ రంగంలో వినూత్న మార్పులు
- జిల్లా వ్యాప్తంగా ప్రతి ఏడాదీ రైతు భరోసా
- దళారులను ఆశ్రయించకుండా చర్యలు
- ధాన్యం కొనుగోలు సైతం ప్రభుత్వమే

ఏలూరు (మెట్రో): గతంలో ఉన్న ప్రభుత్వాలు రైతు సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వకపోగా రైతులు చేసే వ్యవసాయాన్ని తీవ్రంగా కించపరిచేలా వ్యాఖ్యలు చేశాయి. వ్యవసాయం దండగ అంటూ.. పారిశ్రామీకరణ ఉంటే చాలంటూ డాంబికాలు పలికాయి. అయితే జగనన్న సర్కారు అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యవసాయం దండగ కాదు పండగ అనే విధంగా మార్పులు తీసుకొచ్చింది. రైతు సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగించింది. రైతులు ఏవిధంగానూ కష్టపడకుండా చర్యలు తీసుకుంది.

జిల్లా వ్యాప్తంగా వరి, మొక్కజొన్న, చెరకు, పొగాకు, అపరాలు, పత్తి, పామాయిల్, వంటి పంటలు 1.33 లక్షల ఎకరాల్లో ప్రధాన పంటలుగా ఉన్నాయి. వీటిలో వరి, మొక్కజొన్న, పొగాకు పంటలను ముఖ్యమైన సాగుగా మలచుకుని 4.83 లక్షల మంది రైతన్నలు వ్యవసాయాన్ని జీవనంగా మలచుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి ఆర్థికంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జగనన్న సర్కారు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంది. జిల్లా వ్యాప్తంగా 484 రైతు భరోసా కేంద్రాలను గ్రామ గ్రామాన ఏర్పాటు చేసి గ్రామాల్లోనే రైతులకు అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంది. అంతేకాకుండా విత్తునుంచి కోత వరకూ గ్రామాల్లోనే రైతులకు సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంది. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ అధికారులు గ్రామాల్లోనే అన్ని సేవలూ అందిస్తూ రైతులకు గత ఐదేళ్లుగా పండుగ వాతావరణంలో చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.



రైతు భరోసా నిధుల వివరాలు

2019వ సంవత్సరంలో 2,24,016 రైతు కుటుంబాలకు రూ.302.42 కోట్లు, 2020లో 2,13,950 మందికి రూ.288.83 కోట్లు, 2021లో 1,90,729 మందికి రూ.257.48 కోట్లు, 2022లో 187950 మందికి రూ.253.73 కోట్లు, 2023లో 1,98,179 మంది అన్నదాతలకు రూ.236.99 కోట్లను ప్రభుత్వం రైతు భరోసాగా అందించింది.

దళారీ వ్యవస్థకు తావులేకుండా

దళారుల బారిన పడి రైతులు ఇబ్బందులకు గురి కాకుండా ఉండేందుకు జగనన్న సర్కారు చర్యలు తీసుకుంది. రైతు భరోసా నిధులను రబీ, ఖరీఫ్ సీజన్‌లకు అనువుగా నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేసింది. అదే విధంగా గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులు పండించిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసి అన్నదాతలకు అండగా నిలిచింది.

ఏలూరు పార్లమెంట్‌ను మోడల్‌గా తీర్చిదిద్దుతా



సాక్షి ప్రతినిధితో వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్

- వ్యవసాయ, వాణిజ్య పంటల అనుబంధ పరిశ్రమలకు ప్రాధాన్యం
- కొల్లేరు పర్యాటకానికి జాతీయ స్థాయి గుర్తింపు అవసరం
- గిరిజన ప్రాంతాల్లో పరిశ్రమలతో పాటు స్వయం ఉపాధిపై ప్రత్యేక దృష్టి

ఇంటర్వ్యూ

తాను పక్కా లోకల్ అని.. ఏలూరు పార్లమెంట్‌లో కొల్లేరు సమస్యలు, జీవన స్థితిగతులు, ఆక్వా ఒడిదుడుకులు.. ఆయిల్‌పామ్, పొగాకు రైతుల లాభనష్టాలు తనకు తెలుసని ఏలూరు వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ చెబుతున్నారు. చిన్నప్పటి నుంచి ఈ ప్రాంతంలో తిరిగి ఇక్కడే పెరిగినవాడినని.. తనకు ఈ ప్రాంతంపై పూర్తి అవగాహన ఉందని అంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వారధిగా ఉంటూ ఏలూరు పార్లమెంట్‌కు అధికంగా కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంతో పాటు మోడల్ పార్లమెంట్‌గా తీర్చిదిద్దుతానని ఆయన స్పష్టం చేశారు. సాక్షితో ఆయన అంతరంగం ఆయన మాటల్లోనే...

– సాక్షి ప్రతినిధి, ఏలూరు

సాక్షి : చిన్న వయస్సులో ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఎలా దక్కింది?

సునీల్‌కుమార్ : ఏలూరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ స్థానాన్ని బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ఎంపిక చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావించారు. ఆలోచన వచ్చిన వెంటనే నాన్న, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆళ్ళనానితో మాట్లాడారు. ఆ తరువాత నాకు తెలిసింది. నన్ను అభ్యర్థిగా ప్రకటించిన వెంటనే సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపి ఎన్నికల ప్రచారం మొదలుపెట్టాం. దాదాపుగా నాలుగు నెలల పాటు పార్లమెంట్‌లోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో పర్యటించా. నా వయస్సు 34 ఏళ్లు. ఎంపీ అభ్యర్థుల్లో పిన్న వయస్కుడిని నేనే.

సాక్షి : మీకు రాజకీయాలు కొత్త కదా.. పార్లమెంట్‌పై అవగాహన ఉందా?

సునీల్‌కుమార్ : ప్రత్యక్ష రాజకీయాల్లో అయితే నేను కొత్త కావచ్చు కాని, 15 ఏళ్ల నుంచి నాన్న రాజకీయాలను చూస్తూనే పెరిగాను. ఏలూరు జెడ్పీ చైర్మన్‌గా, తణుకు ఎమ్మెల్యేగా, ప్రస్తుతం మంత్రిగా కూడా నాన్న పనిచేస్తున్నారు. మూడు ఎన్నికకలను క్రియాశీలకంగా చూడటంతో పాటు రెండు సార్వత్రిక ఎన్నికలకు పనిచేయడంతోపాటు ప్రచారం కూడా చేశాను. ఇక పార్లమెంట్‌పై పూర్తి అవగాహన ఉంది. నేను ఈ జిల్లా వాడినే. ఇక్కడే పుట్టాను.. పెరిగాను.. చదువుకున్నాను. ఉన్నత విద్యాభ్యాసం కోసం విదేశాలకు వెళ్లినా చదువు పూర్తి కాగానే ఇక్కడకే వచ్చాను. ఆక్వా మొదలుకొని గిరిజన ప్రాంత ప్రజల సమస్యలు అన్నింటిపై నాకు పూర్తి అవగాహన ఉంది.

సాక్షి : మోడల్ పార్లమెంట్‌గా తీర్చిదిద్దడమంటే.. ఏం చేస్తారు?

సునీల్‌కుమార్ : ఏలూరు పార్లమెంట్‌ను మోడల్ పార్లమెంట్‌గా తీర్చిదిద్దుతా. ప్రధానంగా వ్యవసాయ ఆధారిత, గిరిజన ఉత్పత్తుల విక్రయాలకు వీలుగా పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారిస్తా. అలాగే గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణం వేగంగా సాగుతోంది. పార్లమెంట్‌లో ప్రధాన రహదారులను అనుసంధానం చేసేలా అవసరమైన చోట్ల కొత్త రహదారుల ప్రతిపాదనలు, పార్లమెంట్‌లో వేలాది మందికి ఉపాధి అవకాశాలు ఉండేలా పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం సాయంపై ప్రత్యేక శ్రద్ధ పెడతాను. ఏలూరు పార్లమెంట్‌ను అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వారధిలా వ్యవహరిస్తూ మోడల్ పార్లమెంట్‌గా తీర్దిదిద్దుతా. ఆర్‌ఓబీల మంజూరు, నూతన రైళ్ల మంజూరు, వందే భారత్ హాల్ట్ ఇలా అన్ని అంశాలపై ప్రత్యేక ఎజెండాతో పనిచేస్తా. పోలవరం ప్రాజెక్టు పూర్తికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాబట్టేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తాం. కొల్లేరు ఏకో టూరిజం సెంటరుగా కేంద్రం సహకారంతో అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాల్సి ఉంది.

సాక్షి : ఉత్పత్తులకు మెరుగైన ధరలు తెస్తారా?

సునీల్‌కుమార్ : నేను అందరికంటే చిన్నవాడినే అయినా అందరితో నాకు మంచి పరిచయాలు ఉన్నాయి. కాబట్టి సమన్వయం సమస్యే కాదు. అందరి సలహాలు, సూచనలతో ముందుకు సాగుతాను. ఆయిల్‌పామ్ రైతులకు మెరుగైన ధర, అలాగే కోకో ఆధారిత పరిశ్రమల ఏర్పాటు ప్రొత్సాహం, గిరిజన ప్రాంతంలో మహిళల స్వయం ఉపాధికి ప్రత్యేక కార్యక్రమం, అదే రీతిలో చిన్న పరిశ్రమలు ఏర్పాటు ప్రాధాన్యతా అంశం. స్థానికంగా ఉత్పత్తి అయ్యే వ్యవసాయ ఉత్పత్తులకు ఇక్కడే కంపెనీలు ఏర్పాటు చేస్తే సమీపంలోని పోర్టులు, కార్గోల ద్వారా ఎగుమతులు చేసే పరిస్థితి ఉంటే ధరల విషయంలో భవిష్యత్తులో డోకా ఉండదు. ప్రభుత్వం హార్బర్లు, పోర్టులు, ఎయిర్‌పోర్టు నిర్మిస్తుంది. పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ఎగుమతి వ్యాపారం మరింత మెరుగవుతుంది.

సాక్షి : టీడీపీ అభ్యర్థి పోలవరానికి విరాళం ఇవ్వడంపై.. మీ స్పందన?

సునీల్‌కుమార్ : కేంద్ర ప్రాజెక్టుకు అది కూడా ఎక్కువ శాతం పూర్తయిన ప్రాజెక్టుకు విరాళం ప్రకటించడం అనేదే హాస్యాస్పదం. పవన్‌కళ్యాణ్ ప్రకటించగానే ఆయన కూడా ప్రకటించాడు. ఈ నేతలే వరదలు వచ్చినప్పుడు ఏజెన్సీ ప్రాంతం అతలాకుతలమైనప్పుడు ఎక్కడికి వెళ్లారు. కోవిడ్ సంక్షోభ సమయంలో ఏం చేశారు. ఎన్నికలకు 15 రోజులు ముందు వచ్చి ఒక్కొక్క ఏరియాకు కోటి రూపాయల విరాళమంటే ఎవరూ పట్టించుకోరు. అదే రీతిలో విరాళాలు ఇవ్వాల్సి వస్తే ఐదు కోట్ల విరాళంతో నేను ముందుంటా. టీడీపీ అభ్యర్థి కేవలం పోలవరం ప్రాజెక్టు కోసమే వచ్చారు తప్పా, ఏలూరు అభివృద్ధి కోసం కాదు.

సాక్షి : మీ విజయావకాశాలు ఎలా ఉన్నాయి?

సునీల్‌కుమార్ : ఏలూరు పార్లమెంట్‌లో రికార్డు స్థాయి మెజార్టీతో గెలవబోతున్నాం. సుమారు 70 ఏళ్ల పార్లమెంట్ చరిత్రలో మొదటి సారి బీసీ అభ్యర్థికి అవకాశం దక్కింది. 7 అసెంబ్లీ స్థానాల్లో క్లీన్‌స్వీప్ సాధిస్తాం. సంక్షేమం, అభివృద్ధి పథకాలే విజయానికి దోహదపడతాయి. 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రూ.8,700 కోట్లకు పైగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందాయి. వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు జరిగాయి. ఎప్పుడూ లేని విధంగా ప్రజలు పూర్తిగా సంతోషంగా ఉండటంతో పాటు జగనన్న తమ ఇంటి బిడ్డగా భావిస్తున్నారు.

ఏలూరు జిల్లాలో 3,500 మందితో ఎన్నికల బందోబస్తు

జిల్లా అదనపు ఎస్పీ స్వరూపరాణి



ఉంగుటూరు: ఏలూరు జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సుమారు 3,500 మంది పోలీసు బలగాలను ఉపయోగిస్తున్నట్లు జిల్లా అదనపు ఎస్పీ జి.స్వరూపరాణి తెలిపారు. ఆదివారం నారాయణపురం వచ్చిన ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆరుగురు డీఎస్పీలు, 21 మంది సీఐలు, 66 మంది ఎస్సైలు, 300 మంది ఏఎస్సై, హెచ్‌సీలు, 161 మంది ఏఆర్ ఫోర్సు, 216 మంది తమిళనాడు పోలీసులు, 300 మంది తమిళనాడు హోమ్ గార్డులు ఎన్నికల విధుల్లో పనిచేస్తున్నారని ఏఎస్పీ స్వరూపరాణి వివరించారు. సెంట్రల్ సాయుధ బలగాలు, ఏపీఎస్పీ పోలీసులు ఎన్నికల విధుల్లో పనిచేయనున్నారని వివరించారు.

ఓటు వేయడం మన బాధ్యత

ఉండి: ఓటు వేయడం మన కనీస బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య ఆదివారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన నాయకుడిని ఎన్నుకునేందుకు తప్పనిసరిగా ఓటు వేయాలన్నారు. అలాగే అన్ని పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని అన్నారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరక్కుండా గట్టి భద్రతా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.